



# మంద సోమిరెడ్డి సమాధి

వస్తానన్న వడ్లాచంద్రయ్య ఇంకా రాలేదు.

కోపం పెరిగిపోతుంది సోమిరెడ్డికి.

గోదారి కాలవా, దాన్ని ఆన్చి ఉన్న ఎర్రకంకరరోడ్డూ సరి సమానంగా ప్రయాణం చేస్తున్నాయి దిగువకి. రోడ్డుకీపక్క గుడిశ ముందు తోమేసిన సీవండి గిన్నెలు నులకమంచం మీద దబ్బిళించి ఉన్నాయి. హంబరుసైకిలుకి అరడజను అరిటిగెలలు కట్టుకుని రేపు జరగబోయే ద్రాక్షారం సంతకి తొక్కుకుంటా వెళ్తున్నాడా బక్కపల్చటి మనిషి. దమ్ము చేస్తున్న చేలలో కొంగలు పురుగుల్నేరుకు తింటున్నాయి. కాలవకొచ్చిన ఉల్లిపాయలమేష్టారు చింతచెట్టుకున్న నాలుగు కాయల్ని బెడ్డముక్కల్తో దుళ్ళగొట్టే పన్లో ఉన్నాడు. పుంతరేవుగట్టు దిగువలో మొలిచిన పోతు బొబ్బాసిచెట్టు పొడుగాటి కాడల్తో తెల్లపూలు పూసింది. దాన్ని జేర్చి ఉన్న పాకముందు కూర్చున్న ఇంజను రాంబాబు చెల్లెలు ఇజీలచ్చుం బిళ్ళారీ అద్దాన్ని చాచిన రెండుకాళ్ళ మధ్యా బిగించి తన నవ్వు ముఖాన్ని అందులో చూసుకుంటా పానితో పక్కపాపిడి



తీసుకుంటుంది.

ఎర్రకంకర్రోడ్డు దిగి నడుచుకుంటూ పొలాల్లోకి దిగెళ్ళిపోతున్న ముసలి సోమిరెడ్డికి బాగా నీరసమొచ్చింది. మల్లిడోరి పొలంగట్టుమీదున్న ముసలి నేరేడు చెట్టు కనపడేసరికి ప్రాణం లేచొచ్చినట్టయ్యి వెళ్ళి దానినీడలో కూర్చున్నాడు.

కాసేపయ్యింది. అలసట తీరలేదుగానీ దావత పెరిగింది. దూరంగా గరికపాటి చిట్టిగారి లిస్టరింజను నీళ్ళు తోడుతుంటే వెళ్ళి బోదికాలవ నిండిపోయి పొంగుతా ముందుకెళ్తున్న ఆ చల్లటినీళ్ళు తాగి భుజానున్న ఖాదీ కండువా తడిపి పిండి ముఖం తుడుచుకున్నాకా మళ్ళీ నడవడం మొదలెట్టేడు.

ఇంకా రాలేదు వడ్లాచంద్రయ్య.

ఇంకీవేళ్టికి రాడేమోలే అనుకుని ముందుకెళ్తుంటే పోతంశెట్టోరి పాకపక్కన మొన్న తుఫానుకి నేలకూలిన రావిచెట్టు కనిపించింది. వెళ్ళి దానిమీద చతికిలబడ్డ సోమిరెడ్డికి తన చిన్నప్పుడు ఆ చెట్టు ఎలా గుండేదో గుర్తొస్తుంది... చిన్నప్పుడు తనతోపాటు స్కూలుకొచ్చిన బడేసాయిబూ, పొట్టిసుబ్బిరెడ్డి, ఎర్రమిల్లి పెదెంకట్రాజూ, వడ్లాచంద్రయ్య గుర్తుకొస్తున్నారు. తనతో బచ్చాలాడిన అరిటిపళ్ళ పట్టం, యండమూరి ప్రభాకరరావూ, ఈగల బుల్లియ్య, పసగాడిసూరన్న గుర్తుకొస్తున్నారు. అక్కణ్ణించి అందంగా వుండే పసలపూడి, ఆరోజుల్లో వచ్చే మల్లికాసులోళ్ళు చెప్పే ఇలోనారాయణమ్మా మారాబత్తుడి కథలూ, ఊరోళ్ళిచ్చిన పాత బట్టల్తో అలంకరించిన గంగిరెద్దు కాళ్ళెత్తి ఆడే ఆటలూ ఇంకా పండగలూ పబ్బాలూ అలాగ తన చిన్నతనవంతా గుర్తుకురాడం మొదలెట్టింది.

* * *

కాస్త చదువుకుని మావూరు పంచాయితీ బోర్డులో బిల్లు కలెక్టరుజ్జోగం చేద్దావని ఆశపడ్డ సోమిరెడ్డి అనుకున్నట్టు బిల్లు కలెక్టరవ్వలేక పోయేడు మరి బతకడానికి బెల్లం వండే పనిలోకెళ్ళేడు. కొన్నాళ్ళకి బెల్లం వండడంలో మా ఏరియాలో పేరెల్లిన రాఘవులుకి నమ్మకమైన మనిషి అనిపించుకున్నాడు.

అయితే ఈ బెల్లం వండే పని ఏడాదిలో మూడు నాలుగునెల్లే ఉంటది. తక్కిన రోజులన్నీ ఖాళీ. మళ్ళీ సీజనొచ్చేదాకా కూలి పనికెళ్ళిపోయేవాడు సోమిరెడ్డి.

ఆ ఏడాది మామిడాడలో ద్వారంపూడి వీరభద్రారెడ్డిగారి పిల్ల రాజ్యలక్ష్మితో సోమేశ్వరం గుళ్ళో పెళ్ళయ్యింది సోమిరెడ్డికి.

వాళ్ళమ్మా బాబులకి చెప్పే సుబ్బారాయుడిగుడికవతల నాజరు బుర్రకథటీములో రాజకీయం చెప్పే బళ్ళముత్యంగారింటిపక్కింట్లో రాజ్యలక్ష్మితో కాపరం పెట్టేడు సోమిరెడ్డి.

చిన్నఇల్లు, ఇంటిముందు చెక్క కటకటాలు. ఇంటెనక దొడ్లో అల్లనేరేడుచెట్టు, ఆకు సంపెంగమొక్కా, మధ్యాన్నవయితే చిక్కనినీడతో పరుచుకుపోయే బాదంచెట్టు, దానికి కొంచెం దూరంగా తియ్యటి కాయలు కాసే నారింజచెట్టూ చాలా బాగుంది ఇల్లు.

సూకల అన్నం ఎండుచేపల ఇగురొండేది రాజ్యలక్ష్మి. పొద్దోయేకా రామచంద్రపురంలో కొత్తగా కట్టిన రాజుగారిహాల్లోకి అంజలీ, నాగ్గాడూ (నాగేశ్వర్రావు) నటించిన కొత్త బొమ్మ కీలుగుర్రం వస్తే వెళ్ళేరు. నేలటిక్కెట్టు కొనుక్కున్న ఇద్దరూ ఇసుకలో కూర్చుని ఆటచూసేక అర్ధరాత్రప్పుడు దారి పక్కన వెన్నెల మరకలు తొక్కుకుంటా తిరిగొస్తా ఆ సినేమాలో అట్ట మేడల గురించి అట్టకత్తి ఫైటింగుల గురించి మాటాడుకుంటా కాలవగట్టు దిగువనున్న వూళ్ళో కొచ్చి ఇంటెనక నులకమంచం మీద బొంత పరుచుకుని నల్లబిన్నీ దుప్పటి కప్పుకుని ఆదమరిచి నిద్రోయేవారు. కత్తిరింపేసే క్రిష్ణమూర్తి అన్నటయానికి రాపోతే చిన్నకత్తిరితో తనే సోమిరెడ్డి జుట్టు మీసాలూ కత్తిరించి గోళ్ళు తీసేసేది రాజ్యలక్ష్మి. లాకులదిగువ కాకోరి సావరం నించి తెచ్చిన గోరింటాకు నూరి రాజ్యలక్ష్మి చేతులకి అరికాళ్ళకీ పెట్టేవాడు. వూరు మాటు మణిగి చాలా సేపయ్యేక పక్కలో బాగా అలిసిపోయిన తర్వాత దొడ్లో ఉన్న దడిలోకెల్లొచ్చిన రాజ్యలక్ష్మి సోమిరెడ్డి కాళ్ళు నొక్కితే ఆ తర్వాత వద్దంటన్నా రాజ్యలక్ష్మికాళ్ళు సోమిరెడ్డి నొక్కేవాడు.

సవ్వారీబండిగట్టిన కోరిశేషయ్య మా ఆడోళ్ళు వస్తున్నారు మీ ఆడోళ్ళని కూడా తీసుకురా రా అన్నప్పుడు రాజ్యలక్ష్మితోపాటు బండెక్కి కేశవరం పోతురాజు తీర్ధం, అటు చింతలూరు తీర్థాలకెళ్ళి ఎర్రకంకరబాటల పక్కనున్న గానుగుచెట్లకింద కోడిపుంజుల్ని కోసుకుని అమ్మోర్లకి నైవేద్యాలు పెట్టుకుని అక్కడే వండుకు తిన్నాకా ఖాళీ గిన్నెల్ని పంట కాలవల్లో కడుక్కుని తిరిగొచ్చేవారు. అలా వచ్చేటప్పుడు

బండిలో ఒట్టిగడ్డి వత్తుగా పరిచి దానిమీద రెండు జంబుకానాలు పరిచేరేమో కూర్చున్న కాసేపటికే మాగన్నుగా కునుకట్టేసేది రాజ్యలక్ష్మికి. అలాగ జాయిగా ఎడ్లబండిమీద ఇంటికొచ్చేసరికి తొలికోడికూసేది. బలభద్రపురమెళ్ళి రైలుబండెక్కి అన్నవరం వెళ్ళేరోసారి... అప్పనపల్లి, చిన్నతిరపతి వెళ్ళొచ్చేరింకోసారి.

సీతాఫలాకాయల్లాటి ఇద్దరు మగపిల్లలు పుట్టేరు. పెద్దోడికి తండ్రిపేరే చంద్రారెడ్డి అని పెట్టుకుని తండ్రిని పిల్చినట్టే నాన్నా అని పిలవడం మొదలెట్టేడు సోమిరెడ్డి. అయితే ఆ కుర్రోడికెప్పుడూ ఏదో తెగులు. వారంలో రెండు మూడురోజుల పాటు రాంపురం, వేరుముక్కలు కట్టించడానికి లొల్లా, గాలి అంటే భూతవైద్యానికి వడిశలేరూ తిప్పుతానే ఉండేది రాజ్యలక్ష్మి. ఆళ్ళు తినే తిండికంటే ఆ కుర్రోడికి ఎక్కువ కర్చులయ్యేవి. దాంతో కూలిడబ్బులు కుటుంబానికి చాలకపోడంతో మొగుడుతోపాటు రాజ్యలక్ష్మికూడా ఊడ్పులకనీ, కలుపుతీతలకనీ వెళ్ళేది.

ఆడపిల్ల ఆడపిల్ల అనుకుంటా వుండగానే ముగ్గురు మగపిల్లలు పుట్టుకొచ్చేరు. ఆ తర్వాత ఇద్దరు ఆడపిల్లలు.

ఏడాదికొకళ్ళు చప్పుని ముగ్గురు మగపిల్లలూ ఇద్దరు ఆడపిల్లలూ పుట్టేరు.

పొద్దుటే అన్నం కూరా వండి కూలికి బయల్దేరి దీపాలవేళకి ఇంటికొచ్చిన ఆ మొగుడూ పెళ్ళాలకి పిల్లలు తినేసిన కాళీ మట్టి కుండా, దాకా కనిపించేవి. పొన్లేద్దూ బిడ్డలు కడుపునిండా తిన్నారని నవ్వుకుని కుండలో నీళ్ళు కడుపునిండా తాగి పడుకునేవారు.

ఊరిమధ్యన గావుగంగ ఉండే రావిచెట్టు చుట్టూ కాపురాలుంటున్న గొల్లల ఇళ్ళు ఖాళీ చేయించి అక్కడ స్కూలు బిల్డింగు కట్టేరు. అయిదో క్లాసుదాకా పాఠాలు చెపుతారట అక్కడ.

దాన్నే చూస్తా ఆ పక్కన నడుస్తూ వెళ్తున్న సోమిరెడ్డి నేనెలాగా చదవలేక పోయేను. నా బిడ్డల్నయినా చదివిస్తాను అని రాజ్యలక్ష్మితో అని పిల్లల్ని అందులో జేర్చేడు.

ఆ పిల్లల చదువులకి వస్తున్న కూలి డబ్బులు చాలకపోతే రాత్రుళ్ళు చిన్నం వాళ్ళ జట్కాతోలేవాడు. దూళ్ళబుల్లియ్య సంతలకి దూళ్ళని తోలుకు వెళ్ళేప్పుడు ''సాయం రావో'' అంటే కూలిడబ్బులు వస్తున్నయ్యి గదాని వాడికూడా వెళ్ళేవాడు. రెండోకొడుకు ప్రభాకర్రెడ్డి బాగా చదూతున్నాడు మార్కులు బాగా వస్తున్నాయి. ''కానీ, మనకి చదివించే ఓపికలేదు ఎలాగా'' అనుకుంటుండగా దూరబ్బందువైన సబ్బెళ్ళ దైవాల్రెడ్డి పాలకొల్లులో లాకుల దిగువలో ఉంచుకున్న శివాలక్ష్మితో కాపురం ఉంటున్నాడు. ఆ మధ్య ఊళ్ళో కొచ్చినప్పుడు ''కుర్రోడ్ని నా దగ్గరకి పంపించు జున్నూరు హాస్టల్లో వేస్తాను'' అన్నాడు.

తీరా తీసుకెళ్ళి హాస్టల్లో వేస్తే మూడువారాలుకూడా తిరక్కుండా పారిపోయి వచ్చేసేడు కుర్రోడు.

ఎందుకొచ్చేవంటే అక్కడ హాస్టల్లోఅన్నం బాలేదు. ''అక్కడ మనుషులు బాలేదు ఒకటే ముక్కువాసన నేనింకెళ్ళను'' అని ఏడ్చేడు.

రాజ్యలక్ష్మి ఒళ్ళో పడుకుని ఆడలా ఏడుస్తుంటే ''వద్దులేరా బాబా వెళ్ళొద్దు...నేనా ఊరెళ్ళి నీ ట్రంకు పెట్టీ అది పట్టుకొస్తానుగానీ ఇంకెళ్ళొద్దు'' అన్నాడు సోమిరెడ్డి.

బస్సుల్లో పాలకొల్లు వెళ్ళడానికి డబ్బుల్లేక పిచ్చితాతారెడ్డి కొట్లో కొత్త ర్యాలీసైకిలు అద్దెకి తీసుకుని బయల్దేరేడు.

కుర్రోడు అక్కడొదిలేసిన పుస్తకాలూ, పచ్చరంగు ట్రంకుపెట్టీ సైకిలు వెనకాల కేరేజీకి బిగించుకు కట్టుకుని తిరిగొస్తుంటే సిద్దాంతం మీద ఒకటే వర్షం. తడిసి ముద్దయిపోయేడు.

అలాగే సైకిలు తొక్కుకుంటా ఆలమూరు, కొత్తూరు జంక్షనూ, అర్తమూరూ పెడపర్తిరేవూ దాటుకుంటా బాగా రాత్రివేళకి ఇంటికొచ్చేసరికి ఫుల్లుగా జొరమొచ్చేసింది సోమిరెడ్డికి.

''అయ్యయ్యో ఒళ్ళు కాలిపోతుంది'' అని రాజ్యలక్ష్మి మంచం మీద పడుకోబెడ్తుంటే ''తగ్గిపోద్దిగానీ పిల్లలు అన్నం తిన్నారా'' అన్నాడు.

పిల్లల్ని అత్తారబతంగా పెంచడానికి అష్టకష్టాలూ పడతానే రాజ్యలక్ష్మి సలహాతో చిన్న కాయిదా వ్యాపారం మొదలెట్టేడు. బానే కలిసొచ్చింది. రాజ్యలక్ష్మికూడా వాళ్ళింటి అరుగుమీదే బియ్యం మూటలేయించుకుని అమ్మడం మొదలెట్టింది. అదికూడా బానే కల్సి రాడంతో కొన్నాళ్ళకి కాస్త ఆస్తి సంపాయించుకోగలిగేరు. రాజ్యలక్ష్మి కొన్ని నగలు సరంబి మీద ఇత్తడిసామాన్లు కూడా పలపర్చుకుంది.

ఆ చుట్టు పక్కల ఊళ్ళల్లోనే మేష్టరు ఉజ్జోగాలు దొరికినియ్యి ఆ కొడుకులికి.

కట్నాలిచ్చి ఆడపిల్లల పెళ్ళిళ్ళు, కట్నాలు పుచ్చుకోకండా మగపిల్లల పెళ్ళిళ్ళు చేసేరు.

ముగ్గురు కోడళ్ళూ వచ్చేకా పసలపూడిలో చాలా కుటుంబాల్లో వచ్చిన తేడాలాంటిదే మండసోమిరెడ్డిగారింట్లోకూడా వచ్చింది. కోడళ్ళు ముగ్గురూ ఏకవయ్యేరు. ఒకరోజు రాంపురం కిషోర్‌టాకీసులో గండికోట రహస్యం సినేమా మేట్నీ చూడ్డానికెళ్ళి ఆటయ్యేకా నడిచొస్తున్నప్పుడు ఒక విషయం మీద బాగా మాటాడుకుని గట్టిగా కూడబలుక్కున్నారు.

ఇంటివాతావరణంలో మార్పులు రాడం మొదలయ్యినియ్యి. ముందు రెండోకోడలూ ఆ తర్వాత ఆఖరికోడలూ గుచ్చుడం మొదలెట్టేరు. ఎప్పుడు ఎరక్కపోడం వల్ల వాటిని విస్తుపోతా చూసిన సోమిరెడ్డి భార్య దగ్గరకెళ్ళి ''ఇదేంటి?'' అన్నాడు.''పోన్లెద్దురూ పిల్లలూ'' అని సర్దేసింది. ఆ తర్వాత ఇంకా తేడాలొచ్చినియ్యి. వాట్నిచూస్తా మళ్ళీ ''ఇదేంట''న్నాడు సోమిరెడ్డి.

''కాలం మారతంది. దాంతో పాటు మనమూ సర్దుకోవాలండి మరి'' అని భర్తకి సర్దిచెప్పి ఇంట్లో ఎలాంటి గొడవా రాకుండా చూసుకుంటావస్తుంది. అలాగ రోజులు పరమానందంగా గడుస్తున్న కాలంలో రాజ్యలక్ష్మికి సుస్తీ చేసింది. రాజమండ్రీ తీసుకెళితే సుగరు జబ్బు బాగా ముదిరిపోయిందన్నారు. కొన్నాళ్ళకి కిడ్నీలు పాడయిపోయినియ్యన్నారు. ఒళ్ళంతా నీరు పట్టేసింది. ఏమాత్రం నెరవని పొడుగాటి వంకీల జుట్టు సుబ్బరంగా రాలిపోడం మొదలెట్టింది.

ఒకరోజు రాత్రి బాగా తేడా జేసేసరికి ఈసారి కాకినాడ తీసుకెళితే కోడళ్ళుకూడా వెళ్ళేరు.

అవతల రాజ్యలక్ష్మి మంచం మీదుంటే ఇవతల హాస్పిటలు వరండామీద కూర్చున్న ముగ్గురు కోడళ్ళు ఆ వయసైపోయిన మనిషికోసం ఎంత డబ్బు పోస్తున్నావో అని మాటాడుకోడం మొదలెట్టేరు.

జబ్బు బాగా తిరగబెట్టింది. పెద్దాపురం సంతలో అమ్మేతట్టం చేపలాగ తయారైన రాజ్యలక్ష్మి మంచానికి అంటుకుపోయింది. మనిషికూడా బాగా కురసయిపోయింది. అన్నీ మంచం మీదే. సోమిరెడ్డే చేస్తున్నాడు సేవలు.

ఒక అర్ధరాత్రివేళప్పుడు రాజ్యలక్ష్మి కాలం చేసింది.

జరిగిన కాలాన్ని తల్చుకున్న సోమిరెడ్డి ఇక ఆ మనిషిలేకుండా బతకడం దండగచచ్చిపోతానని ఒకటే గొడవచేస్తే వడ్లాచంద్రయ్యొచ్చి సర్దేడు.

పిల్లదినం, పెద్దదినం అయ్యేక పిల్లలందర్నీ పిల్చి ''మీ అమ్మ మనకందరికీ ఎంతో చేసి వెళ్ళిపోయింది. అసలలాంటి మనిషిమనమధ్య ఉండెళ్ళడం నా అదృష్టం. నేనెప్పుడో చేసుకున్న పుణ్యం. కాబట్టి ఆవిడ కార్యక్రమాలు చాలా గొప్పగా జరగాలనుకుంటున్నాను'' అనాగి

''దశదానాల్లో భూదానం చాలా గొప్పది అన్నారు గోదారవతల ఐనవిల్లిలో బ్రాహ్మలు. కాబట్టొరే మన పొలంలో అరెకరం బ్రేహ్మల సుబ్బారావుగారికి దానం చేద్దామనుకుంటున్నాను''అన్నాడు.

ఇంట్లో అంతా అప్పుడు బాగానే విన్నారు.

మర్నాడు చల్దిపొద్దేళప్పుడు తండ్రి పేరెట్టుకున్న పెద్దోడు చంద్రారెడ్డి ''నాన్నా... దానం అని బానే అనేసేరు గానీ ఇప్పుడు మనూళ్ళో ఎకరం ఎంత పలుకుతుందనుకుంటున్నారు?'' అనేసి ఎదురడిగేడు.

''గోదానం, అన్నదానం అంటా డబ్బు ఖర్చు చేయకండా ఏదన్నా ఇంట్లో ఉన్నదిచ్చేస్తే ఖర్చు తగ్గుద్ది'' అన్నాడు రెండోకొడుకు సూర్యప్రభాకరెడ్డి.

''దానాలు, భోజనాలు అంటా ఏంటిది? పోయిన మా అమ్మ ఇవన్నీ చూడ్డాని కొస్తుందా? ఎంత ఖర్చు తగ్గించుకుంటే అంత మంచిది'' అనేసి సలహా ఇచ్చాడు మూడోకొడుకు సాంబశివరెడ్డి.

రెండోకోడలిచ్చిన ఐడియాని ఫాలో అయిపోయిన రెండోకొడుకు ప్రభాకరెడ్డి బ్రేమ్మలు సుబ్బారావుగారింటికెళ్ళి కాస్సేపు ఆమాటా ఈ మాటా అయ్యేక ఆఖర్లో అసలు పాయింటు కొచ్చి ఒప్పించి, అక్కడ్నించి దూళ్ళవ్యాపారం చేసే దూళ్ళ బుల్లియ్య ఇంటికెళ్ళి ఆ మనిషితో కాసేపు మాటాడొచ్చేడు.

కార్యక్రమం జరిగేరోజు దూళ్ళబుల్లియ్యపాకలో ఆవుని తీసుకొచ్చి సుబ్బారావుగారికి దానం చేసేరు.

దీపాలవేళవుతున్నప్పుడు బ్రేమ్మల సుబ్బారావు గారింటికెళ్ళి ఆ ఆవుని తీసుకుని ముందే అనుకున్న ప్రకారం నూటపదార్లు ఆయన చేతిలో పెట్టి పొద్దుట బుల్లియ్య దూళ్ళపాకలో విప్పిన కట్రాడుకే తిరిగి ఆవుని మెల్తేసి కట్టి బుల్లియ్యకోఅర్ధనూట పదార్లిచ్చేసి ఇంటికి తిరిగొచ్చేసేసేడు.

కూతుర్లు విమల, అమ్మాజీల కళ్ళు పోయినతల్లి వదిలేసి వెళ్ళిన నగలూ, చీరలూ, వెండిసామాన్లు, భోషాణంలోనూసరంబీల మీద సర్దిన కంచు సామాన్ల మీదున్నాయి.

కార్యక్రమాలు ఘనంగా జరిపించిన సోమిరెడ్డి...భార్య సమాధి వాళ్ళ పొలాల మధ్య అమ్మోరిగుడిలా చాలా గొప్పగా కట్టించాడు. అదంతా చూసిన పెద్దకోడలు ''సమాధి కట్టించాలా డబ్బులు దండగ. ఈరోజుల్లో సమాధులు ఓల్డుఫేషనట'' అనేసింది.

''ఈ కార్యాలూ దానాలూ అంటా చాలా డబ్బులు తగలేస్తున్నాడు. మళ్ళీ ఏటీడు వచ్చినప్పుడు ఎంత డబ్బు దారబోస్తాడో నాన్న'' అంది అమ్మాజీ.

ఆ మధ్యాన్నం ఇంటరుగుమీద కూర్చుని ఈరుబ్బానితో తలలో ఈళ్ళు తీసుకుంటున్న విమల దగ్గరకి జేరిన రెండోకోడలు ''వయసుమళ్ళిన మాంగారికి ఏం చెయ్యాలో ఏం చెయ్యగూడదో తెలీడం లేదు వదినీ! మీరే నచ్చుజెప్పి ఆ మనిషిదగ్గరున్నయ్యి లాక్కోవాలి'' అంది.

ఈ మాటలన్నీ ఆ మనిషి నోటమ్మటా ఈ మనిషి నోటమ్మటా పాకి చివరికి సోమిరెడ్డి చెవిలో పడినియ్యి. చాలా బాధపడ్డ సోమిరెడ్డి ఆరోజు పొద్దుటా, మధ్యాన్నం పస్తుంటే దీపాలవేళదాటేక బలవంతంగా వాళ్ళింటికి తీసుకెళ్ళిన వడ్లాచంద్రయ్య ఈ వయసులో ''ఏంట్రా ఇది కాస్త ఎంగిలి పడుదూ గాని రా లేకపోతే ఆలోకంలో ఉన్న మా చెల్లెలు బాధపడద్ది మరి'' అని బెదిరించి అన్నం తినిపించేడు.

ఇంతలో వెనకటికి మావూరి చివర తాడిచెట్టు మీద పడ్డ పిడుగులాంటి గోదానం వార్త బ్రేమ్మలసుబ్బారావుకొడుకు ఎర్రబ్బాయిగారి ద్వారా తెల్సిపోయింది సోమిరెడ్డికి. అంతే

వడ్లాచంద్రయ్య ఇంటి అరుగుమీద కూలబడిపోయి జీవితంలో మొట్టమొదటిసారిగా కళ్ళమ్మట నీళ్ళెట్టుకున్నాడు మండసోమిరెడ్డి పావుగంటా అరగంటా కాదు ఆ రాత్రిపూట ఎంతసేపు ఏడ్చేడో తెలీదు.

అలా ఏడ్చి ఏడ్చాక కళ్ళెండిపోయిన సోమిరెడ్డి నెమ్మదిగా నడుస్తా ఇంటికెళ్ళిపోయేకా అరుగుమీద నిలబెట్టి ఉన్న తన మంచాన్ని దాని మూలనున్న నల్లబిన్నీ దుప్పటినీ మాసిన తలగడనీ తీసుకున్నాడు. మంచం వాల్చుకుని దిండేసుకుని దుప్పటి పరుచుకుని పడుకునే ముందు చాలా సేపు ఆలోచించుకుని ఒక నిర్ణయానికొచ్చేక తెల్లారే ముందు పడుకున్నాడు.

* * *

వడ్లాచంద్రయ్యద్వారా తద్దినాలు పెట్టే రాపాకపంతుల్ని పుంతరేవు దగ్గరకి పిలిపించి తన ఆత్మపిండాల్ని వదిలేసేడు. దశదానాలు ఇచ్చేసుకున్నాడు. పొలం మధ్యలో తన భార్య సమాధి పక్కనే తన సమాధికూడా కట్టించి దానికి ఎల్ల (తెల్లసున్నం) వేయించేడు.

ఇంట్లో వాళ్ళు, ఊళ్ళోవాళ్ళు భార్యపోయేకా మండసోమిరెడ్డికి మతిపోయింది పెనికేరు ఆచార్లుగారి పిచ్చాస్పటలుకి తీసుకెళ్ళి తల్లకిందులుగా నిలబెట్టి ముక్కులో అల్లంరసం పోస్తేగానీ  గుణం కనిపించదు అంటున్నారు.

ఆ మాటలన్నీ వింటున్న సోమిరెడ్డి ఎవరికేసీ తలెత్తి చూడ్డం లేదు. అసలతను నోరువిప్పి చానాళ్ళయిపోయింది. ఎప్పుడూ ఏదో ధ్యానంలో ఉన్నట్టుంటున్నాడు. రోజంతా తమ  సమాధుల దగ్గరే కూర్చుని చావు ఎప్పుడొస్తదా ఎప్పుడు సమాధిలోకి వెళ్ళిపోదామాని ఎదురు చూస్తున్నాడు.

* * *